క్లుప్తంగా

ఈరన్నస్వామికి పూజలు



కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివి ధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూ లవిరాట్‌కు తెల్ల వారు జామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి,పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

అన్నదానానికి బియ్యం వితరణ



పీర్లచావిడి నిర్వాహకులకు బియ్యం అందజేస్తున్న కౌన్సిలర్ మధుబాబు

ఆదోని టౌన్: పట్టణంలోని దివాకర్‌రెడ్డి నగ ర్‌లో కొడి పీర్ల పండగ సందర్భంగా అన్నదాన నిమిత్తం 19వ వార్డు కౌన్సిలర్ మధుబాబు క్వింటా బియ్యాన్ని విరాళంగా అందించారు. ఆయన మాట్లాడుతూ కొడి పీర్ల పండగను అన్నివర్గాల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించు కోవాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కమిటీ ఇన్‌చార్జ్ గంజులయ్య, సూగూర్‌భాయ్, బీరువాల హనుమంతు, మనీబాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీలేఖ

నందవరం : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 32 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ..గర్భిణులకు బీపీ, హెచ్‌పీ, ఐరన్ మాత్రలు పంపిణీ వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే గర్భంలోని శిశువు ఎదుగుదలకు గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సుశీలబాయి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

గోనెగండ్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. సోమవారం మండల పరి ధిలోని బైలుప్పల ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిం చాలని సిబ్బందికి సూచించారు. డయేరియా, దోమల వలన వచ్చే మలేరియా, డెంగీ జ్వరా లపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీదేవి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను రద్దు చేయాలని వినతి

ఆదోని రూరల్: మాదాసి, మాదారి కురువలకు ఇచ్చిన ఎస్సీ సర్టిఫికెట్లను రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరాం, ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసాపురం ఎల్లప్ప కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణానికి చెందిన కురువ వేమన్న గారి కుమారుడు కురువ నాగరాజు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొందాడని, దీనిపై ఇదివరకే ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమం లో నాయకులు వీరేష్, నాగరాజు, నరేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కౌతాళం : కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలోని హాల్వి గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుం ది. గ్రామానికి చెందిన కొల్లి అమరేష్ భార్య కొల్లి గంగమ్మ (40) రెండేళ్లుగా టీబీతో బాధ పడుతోంది. వైద్యం చేయించినప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటికి నిప్పంటించుకొని ఆత్మ హత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు, పోలీ సులు తెలిపారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కౌతాళం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్లకు ఎదురు చూపులు

- మూడు నెలల క్రితం ఇంటర్ ఫలితాల విడుదల
- ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయని ప్రభుత్వం
- ఆఫ్‌లైన్లో చేపడుతారా.. ఆన్‌లైన్‌లో చేపడుతారో తెలియని పరిస్థితి



ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యా ర్థులు డిగ్రీలో తమకు నచ్చిన గ్రూపులో చేరడానికి ఎదురుచూస్తున్నారు. ఫలితాలు వెలువడి నెలలు గడుస్తున్న డిగ్రీ కళాశాలలో ప్రవేశాలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించ లేదు. అడ్మి షన్లకు ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. గత ఏడాది మాదిరిగా ఆన్‌లైన్‌లో చేపడుతారో లేదా ఆఫ్ లైన్‌లో చేపడుతారో లేదో తెలియని పరిస్థితి. దీంతో ఎక్కడ చేరాలో, ఏమి చేయాలో తెలియక విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

గతేడాది మిగిలిన సీట్లు

గత సంవత్సరం ఆలస్యంగా అడ్మిషన్లు చేపట్టడంతో చాలా కళాశాలల్లో సీట్లు మిగిలిపోయాయి. గత ఏడాదికన్నా ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. దీంతో కళాశాలల్లో అడ్మిషన్లు కూడా తగ్గే అవకాశం ఎక్కువగా ఉంది. పేద మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాల్సిన కూటమి సర్కార్ వాటిని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తుందనే విమర్శలు సర్వత్రా వినబడుతున్నాయి.

వెనుకబడిపోతున్న ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

ఇంటర్మీడియెట్ ఫలితాలు ఏప్రిల్ 12న విడుదలై నెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాలపై నోటిఫికేషన్ విడుదల చేయలేదు. జూన్‌లోనే పాఠశాలలు, జూని యర్ కళాశాలలు ప్రారంభం చేసి తరగతులను నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాలల్లో కూడా 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లను చేపట్టి తరగతు లను ప్రారంభించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియపై సరైన స్పష్టత ఇవ్వ లేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలలు నుంచి డిగ్రీ ప్రవే శాల కోసం విద్యార్థులు ఎదురు చూపులు చూస్తు న్నారు. ఆడ్మిషన్లు ఆలస్యమవుతుండటంతో పేద మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళా శాలలు ఫలితాల్లో వెనుకబడి పోతున్నాయి. సమ యానికి అడ్మిషన్లు జరగక పోవడం, తాముకో రుకున్న కళాశాల, తాము చేరాలనుకున్న గ్రూపులు అందుబాటులో లేక పోవడంతో విద్యార్థులు నిరు త్సాహానికి గురవుతున్నారు.

నియోజకవర్గంలో 2,500 మంది ఎదురుచూపులు

ఆదోని నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలలు నాలుగు ఉన్నాయి. అందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఒకటి ఎయిడెడ్ కళాశాల, రెండు ప్రైవేట్ కళాశాల ఉన్నాయి. ఆయా కళాశాలలో వివిధ గ్రూపులో 2 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మూడు వేలమంది పైబడి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అం దులో 2,500 మందికి పైబడి విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఒక నియోజకవర్గంలోనే ఇంత మంది ఉంటే జిల్లాలో ఇంకెంత మంది ఉం టారో అర్థం చేసుకోవచ్చు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి



ఇంటర్మీడియెట్ ఫలితాలు వచ్చి మూడు నెలలు గడుస్తున్నాయి. భవిష్యత్తులో స్థిరపడాలి అంటే ఉన్నత విద్యను అభ్యసించాల్సిందే. పేద మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాలకు సంబం ధించి స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక ఆందోళనకు గురవుతున్నాం. ఫలితాలు వచ్చి నెలలు గడుస్తున్నా ప్రవేశాలకు మాత్రం నోటిఫికేషన్ విడుదల చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ విడుదల చేయాలి.

– ఉదయ్ కిరణ్, విద్యార్థి

ఎదురు చూస్తున్నాం



డిగ్రీలో చేరడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఎప్పుడు విడుదల చేస్తుందా అని ఎదురు చూస్తున్నాను. ఇం టర్మీడియెట్ ఫలితాలు వచ్చి మూడు నెలలు కావస్తుంది. ఎక్కడ చేరాలో ఏమి చేయాలో తెలియక అయోమయంగా ఉం ది. ప్రవేశాలపై ప్రభుత్వం సరైన స్పష్టత ఇవ్వడం లేదు. ఆఫ్ లైన్లో, ఆఫ్‌లైన్లో తీసుకుంటారో తెలియని పరిస్థితి. ఇప్పటికై న ప్రభుత్వం ప్రవేశాలపై ఓ స్పష్టత ఇస్తే బాగుంటుంది.

– రోహిత్, విద్యార్థి

ప్రభుత్వ కళాశాలలను నిర్వీర్యం చేసే కుట్ర



డిగ్రీ ప్రవేశాల కోసం వేలాది మంది విద్యార్థులు ఎదురు చూపులు చూస్తున్నారు. ఇంటర్ ఫలితాలు విడు దలై నెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం తీరు చూస్తుంటే ప్రభుత్వ కళాశాలలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ కళాశాలలను ప్రొత్సహించే విధంగా ఉంది. దీంతో పేద మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

–శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

అడ్మిషన్లు వెంటనే చేపట్టాలి

ఆదోని రూరల్: డిగ్రీ అడ్మిషన్లను వెంటనే చేపట్టాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌ఓ ఆధ్వర్యం లో సోమవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళా శాల రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై జూన్ నెల ముగిసినప్పటికీ డిగ్రీ ప్రవేశ నోటిఫికేషన్ గురించి ఎలాంటి సమాచారం లేదన్నారు. కోవిడ్‌కు ముందు మే నెలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమై జూన్ నెలలోపు పూర్తయ్యేదని గుర్తు చేశారు. కార్య క్రమంలో నాయకులు రాజేష్, ఇమ్రాన్, నరసిం హులు, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీలో రీ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: డిగ్రీలో టీసీ ఆధారిత రీ అడ్మిష న్లకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకో వాలని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ సోమవారం ఓ ప్రకట నలో తెలిపారు. రాయలసీమ విశ్వవిద్యాలయం డిగ్రీ డీన్ సీడీసీ ఉత్తర్వుల మేరకు డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరంలో ఈ అడ్మిషన్లు జరుగుతు న్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ప్రతి విద్యార్థికి వసతిసౌకర్యం కల్పించాలి

ఆదోని సెంట్రల్: దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యా ర్థికి హాస్టల్‌లో వసతి సౌకర్యం కల్పించాలని ఎస్ ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు శ్రీధర్ కోరారు. సోమవారం వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బీసీ వసతి గృహాల్లో చాల మంది విద్యార్థులకు సీట్లు దొరకక పోవడం వలన చదువును మధ్యలోనే ఆపేస్తున్నారన్నారు. అత్యంత వెనుకబడిన ఆదోని డివిజన్‌లో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉన్నారని, పరిస్థితులను దృష్టిలో ఉంచు కొని ప్రతి విద్యార్థికి హాస్టల్‌లో సీటు ఇవ్వాలని కోరారు. కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, ఉత్తేజ్, చిరు, ఉమాకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు టి.మురళీ నాయుడు

గోనెగండ్ల: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోం దని, టీడీపీ, జనసేన నేతలు ఉన్మాదుల్లా వ్యవహరి స్తున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు టి. మురళీ నాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలో బీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక వాహనంపై టీడీపీ, జనసేన శ్రేణులు జరిపిన దాడిని బీసీలు తీవ్రంగా ఖండిస్తు న్నామని చెప్పారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొనేం దుకు వస్తున్న చైర్ పర్సన్ హారిక దంపతుల వాహ నాన్ని అడ్డుకుని రాళ్లతో దాడిచేసి, కారు అద్దాలు పగలగొట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. గంటకు పైబడి వాహనాన్ని నిలిపివేసి నోటితో చెప్పలేని బూతులు మాట్లాడటం వారి నీచ సంస్కృతికి పరా కాష్ట అని అన్నారు. పోలీసులు ఈ విషయంలో చేతులెత్తేయడం సరికాదన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడటం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేందుకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునిస్వామి, రంగ స్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ లేకుండా పోయింది

కౌతాళం: కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత రెడ్‌బుక్ పాలనలో మహిళలకు రక్షణ లేకుం డా పోయిందని వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చాగి హనుమంతు ఆరోపించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జెడ్పీ చైర్మన్‌కే ఇలాంటి పరిస్థితి వస్తే సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ నుంచి వస్తుందన్నారు. జెడ్పీ చైర్మన్ హారిక దంపతులపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడి కార్ అద్దాలను టీడీపీ, జనసేన గుండాలు పోలీసుల సమక్షంలోనే ధ్వంసం చేయడం దురదృష్టకరమన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉప్పాల హారికపై జరి గిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కరించండి



ప్రజా సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరి ష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆ ర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయవద్దని సబ్‌కలెక్టర్ మౌర్య భర ద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ నిర్వ హించి ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖ ల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలి యజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్ర మంలో డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, డీఎల్‌పీఓ తిమ్మ క్క, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఏడీఏ బాలవర్ధిరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లూ.. బైకు నడపొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: మైనర్ విద్యార్థులు బైకు నడప రాదని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవ గాహన కల్పించారు. కొంతమంది మైనర్లు బైకు నడుపుతూ సీఐ కంట పడడంతో వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలబారిన పడితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పదవీవిరమణ సన్మానం



అధ్యాపకుడు బసవరాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని బనవాసిలో జవహర్ నవోదయ విద్యాలయంలో చరిత్ర అధ్యాపకు లుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఎస్‌కే బస వరాజును ఘనంగా సన్మానించారు. సోమవారం విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతితో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పూలమాలలు, శాలువా లతో ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నదీతీరంలో పటిష్ట భద్రతా చర్యలు



నదీతీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శ్రీమఠం, ప్రభుత్వ అధికారులు

మంత్రాలయం రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రా లయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా తుంగభద్ర నదీ తీరంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ నూర్జహాన్, ఎస్ఐ శివాంజల్ సూచిం చారు. సోమవారం స్థానిక శ్రీమఠం కార్యాలయం సమావేశ భవనంలో గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, పంచాయతీ ఈఓ ఉపేంద్ర రెడ్డి, మఠం అధికారుల ఆధ్వర్యంలో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగ భద్ర నదిలో పుణ్యస్నానాల కోసం వెళ్లే భక్తులకు ఇబ్బందులు, ప్రమాదాలు జరుకుండా ప్రత్యేక బారి కేడ్లు, ర్యాంప్‌లు, భద్రత ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఈనెల 12న నదిలో ముగ్గురు యువ కులు గల్లంతై మరణించడం చాల బాధకరమ న్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. నదీతీర ప్రాంతాలు పరిశుభ్రత, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆగస్టు 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే శ్రీ రాఘవేంద్ర స్వామి 354 వ ఆరాధ నోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలిరాను న్నారు. ఈమేరకు ముందస్తు ప్రయాణికతో పటిష్ట ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాస రావు, ఇంజనీరింగ్ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

కోసిగి: సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం చింతకుంట గ్రామంలో ఉదయం 10.30 గంటలైన సచివాలయం తెరు చుకోలేదని నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి ఆధార్ నమోదు కోసం పనులు మానుకుని ప్రజలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నార న్నారు. అధికారులు మాత్రం వేళకు రావడం లేదని ఆరోపించారు.

కేజీబీవీలో సీట్ల భర్తీ

నందవరం : మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి సంబంధించి సీట్లు భర్తీ చేసినట్లు ప్రిన్సిపాల్ శైలజ సోమవారం తెలిపారు. 6వ తరగతి ప్రవేశం కొరకు ప్రభుత్వం కేటాయించిన సీట్లు భర్తీ చేశామని, అలాగే 7, 8, 9,10వ తరగతులలో ఉన్న ఖాళీలు కూడా భర్తీ చేసినట్లు వివరించారు. కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయార్ ఎంపీసీ గ్రూపు సంబంధించి 16 సీట్లు ఖాళీ ఉన్నా యని, ఆసక్తి ఉన్న విద్యార్థినులు కేజీబీవీ విద్యా లయంలో సంప్రదించాలన్నారు.

నేడు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు సోమవారం తెలిపారు. స్థానిక మాచాని మెమోరియల్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని ఇస్వీ రోడ్డులో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి దాడులు పోలీసులు చేశారు. పేకాట ఆడుతున్న 15 మం దిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17,100 నగదును, ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

ఆదోని రూరల్: ఆదోని మండలం, పట్టణ రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసు కుంటామని ఏడీఏ బాలవర్ధిరాజు హెచ్చరిం చారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాల యంలో ఆయన వ్యవసాయ సిబ్బంది, రైతు లతో సమావేశమై మాట్లాడారు. కౌతాళం, ఆదోని, కోసిగి, పెద్దకడబూరు మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబా టులో ఎరువులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండుకు చేరిన ప్రమాద మృతుల సంఖ్య

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని పట్ట ణానికి చెందిన షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) అనంతపురం మార్కెట్ యార్డు నుంచి మొక్క జొన్న కంకులను ఆటోలో లోడు చేసుకుని ఆదివారం వేకువజామున తిరుగు ప్రయాణ మయ్యాడు. కల్లూరు పెన్నానది బ్రిడ్జి వద్ద ఆటో టైర్ మారుస్తుండగా కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రం గా గాయపడిన మరియమ్మ, ఉమాదేవిని అనం తపురంలోని సర్వజనాస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకె ళ్లారు. అక్కడ కోలుకోలేక ఉమాదేవి (38) మృ తి చెందింది. ఆమెకు ఓ కుమారుడు ఉన్నాడు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న గుడిసె గోపాల కృష్ణ

కోసిగి: మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మ రింత బలోపేతం చేసేందుకు తమ వంతుగా శాయశ క్తుల కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక(కల్చ రల్) విభాగం మండల అధ్యక్షులు గుడిసె గోపాల కృ ష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృ హంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, కోసిగి మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి పార్టీలో సముచిత స్థానం కల్పించినం దుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో ముళ్లపొదల తొలగింపు



జేసీబీతో ముళ్ల పొదలు తొలగిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో ఎస్సీ కాలనీ శివారులో ఏపుగా పెరిగిపోయిన ముళ్ల పొదలను ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో జేసీబీ ఏర్పాటు చేసి తొలగించినట్లు వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు తెలిపారు. సోమవారం కాలనీలో జేసీబీతో పనులకు ముమ్మరంగా చేపట్టారు. కాలనీ సమీపంలో రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలు పెరిగి రహదారి మూసుకుపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి జేసీబీని ఏర్పాటు చేసి పనులు చేయించి రహదారిని ఏర్పాటు చేశారన్నారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేవై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీని విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమా వేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, విజయ్‌కు మార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బీసీ బాలుర హాస్టల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి వారు ప్లీనరీ సమావేశ కరపత్రాలను ఆవిష్కరిం చారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో పేదవారికి విద్య అందని ద్రాక్షలా మారుతోందన్నారు. ప్లీనరీకి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడుదాం



ఆదోని డీఈ పురుషోత్తంకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరా టాలు చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు నుంచి ప్రద ర్శనగా ఆదోని విద్యుత్ డీఈ కార్యాలయం వరకు వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, ముక్కన్న, వీరారెడ్డి, హను మంతరెడ్డి, మల్లయ్య, గర్జప్ప, గోవిందు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు తక్షణమే రద్దు చేయాలి

స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అం దించారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మణి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా సహాయ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ఎదుట సీపీఎంఆ ధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు నేతృత్వంలో రైతులు ధర్నా చేశారు. కార్యక్రమంలో రాముడు, వీరేష్, నాగేంద్ర, గోపాల్, చిన్నన్న తదిత రులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: స్మార్ట్ మీటర్లపై పోరుబాటలో భాగంగా సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డికి సమర్పించారు.

గోనెగండ్ల : స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకో వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి. ఆనం ద్ బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గోనెగం డ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. సీపీఎం శాఖ కార్యదర్శి కరుణాకర్, నాయకులు నబి రసూల్, రసూల్, రామకృష్ణ తది తరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్మార్ట్‌మీటర్ల విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం నాయకులు రామాంజినేయులు, గోవిందు ఆధ్వర్యంలో పట్ట ణంలోని డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రైతు సం ఘ నాయకులు అబ్దుల్లా, చేనేత సంఘ నాయకులు కాలప్ప, యువజన సంఘ నాయకులు సురేష్ తది తరులు పాల్గొన్నారు.

కౌతాళం: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం మండల కార్యదర్శి ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని లైన్ ఇన్‌స్పెక్టర్ అందజేశారు.

మంత్రాలయం రూరల్: స్మార్ట్ మీటర్లు బిగించడం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.డి. అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయం ఏఈ కార్యాలయం ఎదుట సీపీఎం ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని సబ్ ఇంజ నీర్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ప్రాణే ష, ఆంధ్రయ, లక్ష్మన్న, సురేష్, దేవా తదితరులు పాల్గొన్నారు.